“ఇదిగో ఇక్కడే! ఈ షాపులో చీరలు బాగుంటాయి” అంటూ ఆగింది సీత.

బుచ్చిబాబు కూడా అగి తలెత్తి షాపు బోర్డువంక చూశాడు. దగాచంద్ క్లాత్ స్టోర్స్ అని రాసివుంది బోర్డుమీద.

“బోర్డుచూస్తే అదో మాదిరిగా వుంది. మనం ఇక్కడ చీరలు కొనొచ్చంటావా?” అనుమానంగా అడిగాడు సీతని.

“ఏమో మరి.... పేరు అలావున్నా చీరలు బాగానే వుంటాయి. నేను చీరలెప్పుడు ఇక్కడే కొంటాను. ఇంక పేరు సంగతంటావా? కొందరు పుట్టిన పిల్లలు బ్రతకకపోతే అలాంటిపేర్లు పెడుతుంటారు. వాళ్ళ తల్లిదండ్రులు అందుకే అలాంటిపేరు పెట్టారేమో?....”

“అవునవును.....మా బంధువుల్లో కూడా ఒకళ్ళు వాళ్ళబ్బాయికి ఫకీరు అని పేరు పెట్టారు.”

“హమ్మయ్య కన్విన్స్ అయ్యావు కదా....ఇహ లోపలికి పద” అంది సీత తేలికగా నిట్టూరుస్తూ.

ఇద్దరూ ‘దగాచంద్ క్లాత్ స్టోర్సు’ లోకి అడుగు పెట్టారు.

కౌంటర్లో వున్న సేఠ్ దగాచంద్ లేచి నిలబడి సీతని సాదరంగా ఆహ్వానించాడు.

“అయియే బహేన్‌జీ...అయియే” అంటూ బుచ్చిబాబుని చూస్తూ “మీద మొగుడూ వుంది?” అని అడిగాడు.

“కాదు.....త్వరలో అవుతుంది” అంది సీత బుచ్చిబాబుని చూసి నవ్వుతూ.

“హి హి హి”

ఆ సమయంలో ఇంకేం చెయ్యాలో తోచక అనవసరంగా నవ్వాడు బుచ్చిబాబు.

“వారెవ్వ..... ఎంత మంచి  కుషి బాత్ చెప్పింది అమ్మ నువ్వు” చెవుల్దాకా నవ్వాడు సేఠ్ దగాచంద్.

“నీ భాషని మంటెట్టా” అని మనసులో అనుకున్నాడు బుచ్చిబాబు.

“మనదీ పెండ్లి హెప్పుడు బహేన్?” అడిగాడు  దగాచంద్.

“మనది కాదు మీది అనాలి” పళ్ళు కొరికాడు బుచ్చిబాబు.

“నాదీ తెల్గూ భాషా మంచిది కాదు సాబ్. గుస్సా చెయ్యొద్దూ సాబ్!” బుచ్చిబాబుతో అని సీతతో “సాబ్ గుస్సావాలా ఆద్మీ వుందీ?” నవ్వుతూ అడిగాడు సేఠ్ దగాచంద్.

“కాదు! మరి ఆయనకి కోపం ఎందుకొచ్చిందో?” అంది నవ్వాపుకుంటూ సీత.

“పెండ్లీ హెప్పుడు సెప్పలేదు బెహన్.”

“ఈ నెల 20న” చెప్పింది సిత.

“వారెవ్వా....ఇంకా రెండు వారాల్ వుంది.  మరి చీరల్ ఎత్తవ్ బహన్?”

“ఈ!” అని అరుస్తూ జుట్టు పీక్కున్నాడు బుచ్చిబాబు.

“బహుత్ గుస్సావాలా అద్మీ!” అన్నాడు దగాచంద్ తెల్లబోయి బుచ్చిబాబువంక

చూస్తూ.

సీత నవ్వింది.

"ఆయనకి కోపం ఏంలేదు సేఠ్ మీ భాష ఆయనకి నచ్చలేదు అంతే. నేను ఇప్పుడు పెళ్ళి చీరెలు కొనడానికే వచ్చాను."

ఆ మాట వినగానే సేఠ్ చాలా యాక్టివ్ అయిపోయాడు.

"హ్రే కిషన్ అమ్మగారికి మంచి మంచి సిల్కూ చీరల్ జరీ చీరల్ చూపించు" అరిచాడు సేఠ్ దగాచంద్.

సేల్స్ కుర్రాళ్లు సీతముందు వరసగా అన్నిరకాల చీరలూ కుప్పలు కింద వెయ్యడం మొదలుపెట్టారు.

ఆ జరీ చీరలు, పట్టుచీరల రేట్లు విన్న బుచ్చిబాబుకి ముచ్చెమటలు పోసాయి. ఎందుకంటే ప్రస్తుతం ఆ పెళ్ళిచీరల బిల్లు కట్టాల్సింది అతనే.

సీతకి అన్నీ ఖరీదయిన చీరలే నచ్చుతున్నాయి. బుచ్చిబాబు ఆమె దృష్టి వాటిమీదనుండి మరల్చాలని ప్రయత్నం చేస్తూ "ఈ చీర చూడు ఎంత బాగుందో...ఈ చీర డిజైన్ చూడు.... జరీ తక్కువున్నా ఎంత గ్రాండ్‌గా వుందో...." అంటూ కాస్త తక్కువ ఖరీదు వున్న చీరల్ని చూపించసాగాడు.

"అబ్బ...నీకు తెలీదు బుచ్చీ చీరెల సెలక్షన్ గురించి నాకు తెలిసినంతగా ఎవరికి తెలీదని మా ఆఫీసులో అందరూ అంటారు" అంది సీత.

"బుచ్చిబాబు హవ్వ....హవ్వ.....హవ్వ...." అని నోటిమీద కొట్టుకున్నాడు.

"ఏంటి? నేను కోతలు కోస్తున్నానని అనుకున్నావా?" అది సీత సీరియస్‌గా చూస్తూ.

"అదికాదు...బుచ్చ ఏంటి? అందరి మధ్యా ఉన్నప్పుడు బుచ్చిబాబు అనో లేకపోతే ఒట్టి బాబు అనో పిలవొచ్చుగా?" సీత చెవిలో అన్నాడు బుచ్చిబాబు.

"బుచ్చి అంటేనే ఎంతో ముద్దుగా ఉంటుంది" అని నవ్వింది సీత.

మొత్తానికి షాప్ అంతా తలక్రిందులు చేసి నాలుగు చీరెలు సెలక్టు చేసింది. వాటికి పన్నెండు వేల రూపాయల బిల్లు అయింది. బుచ్చిబాబు చీరల్ని బేరం ఆడడానికి ప్రయత్నించాడు.

"ఏంటీ సాబ్....హిట్లా చీరల్ ధరా తగ్గించి బేరం అడితే నేను దగాచంద్ కాదు దివాలాచంద్ అయిపోతాన్" అన్నాడు దగాచంద్. అతని చీరల ధరలు తగ్గించడానికి ఏమాత్రం ఒప్పుకోలేదు. ఎందుకొప్పుకుంటాడు సీతకి ఆ చీరలు చాలా బాగా నచ్చాయి అని తెలిసిన తరువాత.

ఎంతో కొంత తగ్గించాల్సిందేనని బుచ్చిబాబు చాలా పట్టుదలగా బేరం అడాడు.

చివరికి సేఠ్ దగాచంద్ చీర ఒకొక్కదానిమీద రెండు రూపాయలు చొప్పున నాలుగు చీరలకి ఎనిమిది రూపాయలు తగ్గించాడు.

“మొత్తానికి మార్వాడీ అనిపించావ్‌రా నాయనా” పళ్ళు నూర్తూ మనసులో అనుకుంటూ బిల్లు పే చేసాడు బుచ్చిబాబు.

“ఇంక పోదామా?” అన్నాడు బుచ్చిబాబు సీతతో.

“ఎక్కడికీ...భలేవాడివే...ఇంక షాపింగ్ కాందే?” నవ్వింది సీత.

“ఇంకా కాలేదు? నా జేబులో డబ్బులు అయిపోయాయి” నసుగుతూ అన్నాడు.

“అబ్బా! ఇప్పుడు చీరల షాపింగ్ కాదులే...చీరలకి ఫాల్స్ లంగాలూ, మ్యాచింగ్ బ్లవుజులూ కొనాలి. నీ దగ్గర ఓ మూడొందలు కూడా లేదా? లేకపోతే ఫర్వాలేదులే..నా దగ్గరున్నాయి” అంది సీత .

“ఛీ ఛీ ఛీ ...ఛా ఛా ఛా.... మరీ సిల్లీగా మాట్లాడకు. మూడొందలు ఎందుకుండవు. నా దగ్గర వున్నాయిలే...నీ డబ్బులేం తియ్యకు సిల్లీగా” అన్నాడు బుచ్చిబాబు మొహమాట పడిపోతూ.

“సరే పద!” అంది సీత.

బుచ్చిబాబుకి అప్పటికే బుర్ర హీటెక్కిపోయింది.

“ఈ చిన్న చిన్నవి రేపు చూస్కోవచ్చుగా?” అన్నాడు మెల్లగా.

“భలేవాడివే! చిన్నచిన్నవా? అసలు ఇదే మెయిన్ షాపింగ్. మ్యాచింగ్ బ్లవుజులూ, లంగాలూ, ఫాల్స్ దొరకడం ఎంత కష్టం అనుకున్నావు? అయినా నేను చెప్పడం ఏంటి.... ఇప్పుడు నువ్వే చూస్తున్నావుగా? నీకే తెలుస్తుంది. ఇప్పుడు కొంటే ఆ టైలర్ జాకెట్లు కుట్టి ఇచ్చేటప్పటికి నేను అన్ని చీరలకి ఫాల్సు కుట్టుకునేసరికి మన పెళ్ళిరోజు వచ్చేస్తుంది”

“అన్ని చీరలూ అంటావేం? నాలుగేగా? ఎన్ని రోజులు పడ్తుంటేమిటి? సిల్లీగా”

“ భలేవాడివే... పెళ్ళికి ఈ నాలుగు చీరలేనంటావా? ఇవి సిల్కు చీరలు. ఇంకా షిపాన్స్ లో కొన్ని చీరలు తీస్కోవద్దు? సేఠ్ గుండు కొట్టిసలాల్ షాపులో షిఫాన్ శారీస్ బాగుంటాయి. అవి అక్కడ తీసుకుంటా”

“గుండు కొట్టిస్‌లాల్? ఏంటో నువ్వు సెలక్టు చేసే షాపులన్నీ సిల్లీగా వుంటున్నాయ్” అన్నాడు బుచ్చిబాబు అయోమయంగా.

“షాపుల పేర్లు సిల్లీగ వుంటేనేం... అందులోని చీరలు సిల్లీగా ఏం లేవుగా? సరే ....పద..మనం జాకెట్లు, లంగాలు కొనుక్కుందాం”

“మనం కాదు జాకెట్లు. లంగాలు నువ్వు కొనుక్కుంటున్నావు!” బుర్రగోక్కుంటు అన్నాడు బుచ్చిబాబు.

ఏదో మాచింగ్ జాకెట్లు, లంగాలూ, ఫాల్సు కొనడం అంటే అది చాలా సింపుల్ షాపింగ్ అని అనుకున్నాడు గానీ షాపింగ్ పూర్తయ్యేసరికి తను ఎంత పొరపాటు పడ్డాడో బుచ్చిబాబుకి అర్థం అయ్యింది.

జాకెట్ కలర్, చీర కలర్‌తో ఎంత బాగా మ్యాచ్ అయినా సీతకి మ్యాచ్ అయినట్టు

అనిపించదు. ఫాల్సూ అంతే.

"అయినా చీర అడుగున వుండేఫాల్స్ కనబడనే కనబడవుకదా............. మరి అంత సెంట్ పర్సెంట్ మ్యాచ్ కావాలా?" అని బుచ్చిబాబు అంటే.

"నీకు తెలీదులే...ఫర్‌ఫెక్ట్‌గ మ్యాచ్‌కాందే నాకు తృప్తిగా వుండదు" అంటుంది.

"లోపల వుండే లంగా గురించి కూడా అంతిదిగా ఆలోచించాలా సిల్లీగా?" అని అంటే

"అమ్మో...లంగా చీరకంటే ఇంపార్టెంట్! లంగా లైట్ అయ్యిందంటే చీర కలర్ తేలిపోయి అందమే పోతుంది" అంటుంది.

చీరల షాపింగ్‌కి పట్టిన టైమ్‌కి నాలుగురెట్లు టైం పట్టింది లంగాలూ, జాకెట్లు షాపింగ్‌కి.

బుచ్చిబాబుకి తలకాయ్ బొప్పి కట్టింది.

"అందరూ పెళ్లయితే కష్టాలన్నారు. కానీ పెళ్ళికి ముందే కష్టాలు మొదలయినట్టున్నాయే !" అనుకున్నాడు బుచ్చిబాబు.

అప్పుడు రాత్రి తొమ్మిదయింది.

బుచ్చిబాబు సీతని ఆటోలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ముందు దించి అదే ఆటోలో ఇంటికెళ్ళి పోయాడు.

సీత తన గదిలోకి వెళ్లబోతుండగా-- "ఆగు"! అని హాస్టల్ వార్డెన్ నాగరత్న గొంతు వినిపించింది.

సీత వెనక్కి తిరిగి చూసింది.

"ఎవరా అబ్బాయ్?" అడిగింది నాగరత్న కొప్పు తడుముకుంటూ.

"అబ్బాయా? ఏ అబ్బాయ్?" ఆశ్చర్యంగా అడిగింది సీత.

"నటించకు. ఇప్పుడు హస్టల్ దగ్గరదించి వెళ్ళాడే.... అబ్బాయ్" కొప్పు నిమురుకుంది నాగరత్న.

"అబ్బాయా? ఇంకా నయం పిల్లోడు, చంటోడు అనలేదు".

"అబ్బా!" బాధగా కొప్పుమీద గుద్దుకుంది నాగరత్న. "మరి అబ్బాయి కాక మరేం అనాలి?" అడిగింది రేగిన కొప్పును సవరించుకుంటూ.

"ఎవరతను? అని అడగాలి" చెప్పి సీరియస్‌గా తన గదిలోకి వెళ్ళి తలుపేసేస్కుంది సీత.

"ఓ అలాగా?" అంటూ వెనక్కి తిరిగి రెండడుగులు ముందుకేసి అంతలోనే నాలుక కర్చుకుని 'వామ్మోవ్..అసలు సంగతి మర్చిపోయా....' అని కొప్పుమీద గుద్దుకుని వెనక్కి వచ్చి

సీత గది తలుపులు దబ దబా బాదింది.

సీత తలుపులు తీసి నాగరత్న వంకా ప్రశ్నార్థకంగా చూసింది.

"ఎవరాయన?" అడిగింది నాగరత్న కొప్పు నిమురుకుంటూ.

"ఎవరాయన కాదు... అతనేమైనా మధ్య వయస్కుడా, ముసలివాడా? ఎవరతను? అనాలి" వార్డెన్‌ని సరిదిద్దింది సీత.

"హబ్బా" బాధగా అరచి మళ్ళీ కొప్పుమీద గుద్దుకుంది నాగరత్న.

"సరే చెప్పు! ఎవరతను?" అడిగింది సీత.

"చెప్పి తీరాలి. ఇది హాస్టల్ అనుకున్నావా? మీ ఇల్లనుకున్నావా? బాయ్ ఫ్రెండ్స్‌తో తిరిగి నీ ఇష్టమొచ్చిన టైమ్‌కి రావడానికి?" కోపంగా కొప్పును పిసుకుతూ అంది నాగరత్న.

"అతను నా బాయ్‌ఫ్రెండ్ కాదు. బుచ్చిబాబని నాక్కాబోయే భర్త. మా పెళ్ళికి బట్టలు షాపింగ్ చేస్కున్నాం. చాలా?" అని అడిగింది సీత.

అది విని నలభై ఏళ్ళు దాటినా పెళ్ళి చేసుకోకుండా కన్నెగా మిగిలిపోయిన నాగరత్న కొప్పుమీద పిడిగుద్దులు గుద్దుకుంటూ బాధగా అరిచింది.

"హబ్‌బ్బా!...."

0 0 0

బుచ్చిబాబు సీరియస్‌గా పని చేస్కుంటుంటే సదాశివం పిలిచాడు.

"బుచ్చిబాబు నీకు మద్రాస్ నుండి ఫోన్‌కాల్"

తనకి మద్రాస్ నుండి ఫోన్ చేసే వాళ్ళు ఎవరై ఉంటారబ్బా? అని ఆలోచిస్తూ రిసీవర్ అందుకుని "హలో బుచ్చిబాబు హియర్" అన్నాడు.

"హల్లో బుష్షీ .... హౌడు యుడూ?" అంది అవతలి కంఠం సంతోషంగా అరుస్తూ.

"బుష్షీగా? ఇక్కడెవరూ ఆ పేరుగలవారు లేరండీ" అయోమయంగా అన్నాడు బుచ్చిబాబు.

"తెల్వులేవోయ్...బుష్షీబాబుని... అవునా?" ప్రశ్నించింది ఆ కంఠం.

"ఓ..... ఆ...... ఆ...... ...... అవును. మీరు?"

"నేనేరా షుండర్!! స్టేట్స్ నుంచి ఈరోజే మద్రాష్ వచ్చాన్.. రేపు మార్నింగ్ ఫ్లయిట్‌కి హైద్రాబాద్ వష్తాన్నా...ఏర్‌పోర్ట్‌కి వష్తావుకదూ?" అడిగింది అవతలి కంఠం.

"ఓ సుందర్!... నువ్వా" ఆనందంతో కేకేశాడు బుచ్చిబాబు.

"రావోయ్ రా....ఏంటీ కాళ్ళీడ్చుకుంటూ అడుగులో అడుగేసుకుంటూ వస్తున్నావ్. మాళ్ళీ శలవో, లేకపోతే పర్మిషనో కావాలా?" తన క్యాబిన్‌లోకి వచ్చిన అబ్బుతో అన్నాడు ఏకాంబరం.

బుచ్చిబాబు గతుక్కుమన్నాడు. కిల్లారి కిత్తిగాడు మనసులో వున్నది ఎలా కనిపెట్టేస్తాడో

ఏంటో!... అనుకున్నాడు.

"ఏంటి? మనసులో వున్నది ఎలా కనిపెట్టేశానా అని ఆశ్చర్యపోతున్నావా? లింగాల చింగీ?"

"అబ్బే...నో నో నో..అలా నేనెందుకు అనుకుంటాను సార్ సిల్లీ!" కంగారుగా అన్నాడు బుచ్చిబాబు.

"ఒహో! అలా అనుకోవడంలేదా...మరి ఏం అనుకున్నావు? మనసులో ఏముందో తెలుసుకోలేని లిప్పాలటిప్పిని అనుకున్నావా?" కళ్ళు ఎగరేశాడు ఏకాంబరం.

"అబ్బే అలా అనుకోవడంలేదు సార్. మీరు ఆవులించకుండానే పేగులు లెక్కబెట్టేస్తారని అనుకున్నా సార్".

"అలా రా దారికి...ఇంతకి క్యాబిన్‌లోకి ఒట్టి చేతులు ఊగించుకుంటూ వచ్చావ్ ఏంటి కత"

"అది..అదీ...." బుర్రగోక్కున్నాడు బుచ్చిబాబు "రెండు రోజులు శలవు కావాలండి. మద్రాసు నుంచి నా క్లోజ్ ఫ్రెండ్ వస్తున్నాడు" మెల్లగా అన్నాడు.

"నిన్నేమో నాక్కాబోయే ఆవిడతో షాపింగండీ...గంట పర్మిషన్ కావాలని అన్నావు కదా అని సరే అన్నాను. ఈవేళేమో మద్రాసు నుండి ఫ్రెండొస్తున్నాడు అని రెండు రోజులు శలవడిగావు. తర్వాత బొబ్బర్లంక నుండి మరో ఫ్రెండ్ వస్తాడు. అప్పుడు నాలుగు రోజులు శలవు కావాలని అంటావు.... నోనోనో"

"మద్రాసు అంటే మద్రాసు అని కాదండీ స్టేట్స్ నుండి ఈ వేళ మద్రాసుకి వచ్చాడు. రేపు మద్రాసు నుండి ఇక్కడికి వస్తున్నాడు సార్....."

"ఏంటీ...స్టేట్స్ నుండా? మరి చెప్పావు కావేమోయ్?"

"అవును సార్....స్టేట్స్ నుండే. వాడు మూడేళ్ళ క్రితం స్టేట్స్‌కి వెళ్ళాడు. అందుకే వాడితో గడపటానికి సెలవు పెడుతున్నాసార్. అంతేగాని బొబ్బర్లంక నుండీ లంకలకోడేరు నుండి చీటికీ మాటికీ వచ్చేవారి గురించి సెలవు పెడ్తానా సార్?"

బుచ్చిబాబు నీళ్ళు నమిలాడు.

"నిజమేనోయ్. అంత దూరం నుండి క్లోజ్ ఫ్రెండ్ వస్తుంటే సెలవు పెట్టకపోతే ఎలా? మళ్ళీ అతను నిన్ను కిలారి కిత్తుగాడని అనుకుంటాడు. నాకీ సెలవు ఇవ్వనందుకు నన్ను లబ్బీల గబ్బు అనుకుంటాడు. సరే సరే... వెళ్ళు వెళ్ళు .... ఒకవేళ అతనితో నాలుగు రోజులు గడపాలనుకుంటే నాలుగు రోజులు సెలవు పెట్టు.... మరేం పర్లేదు!".